## క్లుప్తంగా

### సాంస్కృతిక కార్యక్రమాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**దుగ్గిరాల:** పద్మభూషణ్ జాషువా కళాపరిషత్ తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ నెల 24న(ఆదివారం) పౌరాణిక పద్య నాటకాలు, ఏకపాత్రాభినయం, కూచిపూడి నృత్యములను ప్రదర్శించనున్నారని పేద్దేటి యోహోను తెలిపారు. శుక్రవారం దుగ్గిరాల గుర్రం జాషువా విగ్రహం దగ్గర పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ సుభాని, కె.నాగేశ్వరరావు, పి.సుమన్, ఎం.ఏసుపాదం జాషువా కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

### వైభవంగా బాలాంజనేయ ఆలయ వార్షికోత్సవం



**ఫిరంగిపురం:** మండలంలోని శిరంగిపాలెం గ్రామంలో బాలాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే వేద పండితులు పవన్‌కుమార్, వినయ్‌కుమార్‌లు ఆలయ ముఖ మండపంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అఖండ పూజలు చేశారు. యాగశాలలో నవగ్రహ, విఘ్నేశ్వర హోమాలు నిర్వహించి భక్తులచే పూర్ణాహుతి గావించారు. బాలాంజనేయస్వామికి అర్చకులు ప్రసన్నమూర్తి పంచామృతాలతో అభిషేకాలు చేసి అష్టోత్తర, సహస్ర నామ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### మూలాంకురేశ్వరికి విశేష పూజలు



**ఫిరంగిపురం:** మండలంలోని అమీనాబాద్ గ్రామంలో మూలాంకురేశ్వరి అమ్మవారికి శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా అర్చకులు విశేష అర్చనలు, పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చకులు అయ్యన్నశాస్త్రి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర, సహస్ర నామ అర్చనలు నిర్వహించారు. ముఖ మండపంలోని శ్రీచక్రానికి లలితా సహస్రనామాలతో కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



**మంగళగిరి టౌన్:** రైతులు రుణాలను సద్వినియోగం చేసుకుని పంట బాగా పండించాలని మంగళగిరి పీఏసీఎస్ చైర్మన్ గాదె పిచ్చిరెడ్డి అన్నారు. జీడీసీసీ బ్యాంక్ మంగళగిరి శాఖ కార్యాలయంలో శుక్రవారం రైతులకు రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా గాదె పిచ్చిరెడ్డి మాట్లాడుతూ రూ.41 లక్షల 21 వేలను రైతులకు రుణాలుగా అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు అందే శివశంకరరావు, వాసా వేణుకుమార్, ఇన్‌చార్జి సీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలి



**తాడేపల్లిరూరల్:** ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, ఎస్.సుబ్బారావులతో కలసి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుదీర్ఘకాలం యాజమాన్యం నిర్లక్ష్యానికి కార్మికులు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఒక్కొక్కరుగా మృతి చెందుతున్నా పాలకవర్గ పార్టీలు స్పందించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికులకు రావాల్సిన బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లాజర్ బాబు, పుష్పలీల, రిబ్కా, సువర్ణ, రమణమ్మ, ఖాసిం, ఇస్మాయిల్, రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

# వేడుకలకు ముస్తాబయిన గణనాథుడు

**ఆటోనగర్‌లో వెలసిన గణనాథుని దుకాణాలు**



ఆటోనగర్‌లో వెలసిన గణనాథుల విగ్రహాల దుకాణాలు

**మంగళగిరి:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ) పరిధిలో మంగళగిరిలోని ఆటోనగర్‌లో గణనాథుల దుకాణాలు వెలిశాయి. ప్రతి ఏటా వినాయక చవితికి ఆరు నెలల ముందే రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వినాయక విగ్రహాల తయారు చేసుకునే వారు ఇక్కడకు చేరుకుని వినాయక చవితి వరకు విగ్రహాలు తయారు చేసి విక్రయించుకుని వెళ్తుంటారు. అలాగే ఈ ఏడాది కూడా ఆటోనగర్‌లో దుకాణాలు తెరచారు. ఎంటీఎంసీతో పాటు పెదకాకాని, గుంటూరు, తెనాలి, విజయవాడ ప్రాంతాలలోని వినాయక మండపాల నిర్వాహకులు మంగళగిరిలోని ఆటోనగర్‌లో పెద్ద ఎత్తున గణనాథుని విగ్రహాలు కొనుగోలు చేస్తారు. విగ్రహాల తయారీదారులు తమ కళా నైపుణ్యంతో బాల వినాయకుడు, నాట్య వినాయకుడు, పంచముఖ వినాయకుడు వంటి వందలాది విగ్రహాలను చూడ చక్కగా తీర్చిదిద్దుతున్నారు. విగ్రహం సైజు ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. నగరంలో అత్యంత భారీ విగ్రహాన్ని మెయిన్‌బజార్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారు.

## వివాదరహితంగా వినాయక చవితి నిర్వహించుకోవాలి

**తుళ్ళూరు డీఎస్పీ మురళీకృష్ణ**



మాట్లాడుతున్న తుళ్ళూరు డీఎస్పీ మురళీకృష్ణ

**పొన్నెకల్లు(తాడికొండ):** వినాయక చవితి పర్వదినాన్ని ఆనందోత్సాహాల నడుమ వివాద రహితంగా నిర్వహించుకోవాలని తుళ్ళూరు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని పొన్నెకల్లు గ్రామంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పొన్నెకల్లు గ్రామంలో ఇరువర్గాలు బాహాబాహీకి దిగి వివాదాలకు కారణమైన నేపథ్యంలో ఇకపై అలాంటి ఘటనలు జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. గతంలో వివాదానికి కారణమైన జాబితాలో 100 మందికి పైగా ఉన్న అందరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, వివాదాలకు దూరంగా ఉండకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. వినాయక విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతం, మండపం, నిమజ్జనం ఇతర వివరాలతో కూడిన అనుమతికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు వివాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ కె.వాసు, సత్యన్నారాయణ, ఎస్ఐ జోజి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి: సీఐ కె.వాసు**

వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరని తాడికొండ సీఐ కె.వాసు సూచించారు. మండపాల ఏర్పాటుకు ఎలాంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదని, అనుమతుల కోసం ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం అనుసరించాలన్నారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే వ్యక్తులు కమిటీగా ఏర్పడి హెచ్‌టీటీపీ గణేష్‌ఉత్సవ్ డాట్ నెట్‌లో అనుమతులు పొందాలన్నారు. ఈ విధానంలో అనుమతులు సులభంగా పొందవచ్చన్నారు. ఊరేగింపులు, విగ్రహ ఏర్పాటులో నిబంధనలు, పోలీసు శాఖ సూచనలు పాటించాలని ఆయన అన్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చిర్రావూరు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఏఐ-డీఎస్, సీఎస్‌సీ-2 విభాగాల వలంటీర్లు ఇంటింటికీ తిరిగి చెత్తను డ్రైనేజీలు, రోడ్లపై వేయరాదని సూచించారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఏఐ-డీఎస్ విభాగాధిపతి డాక్టర్ వీఎస్‌వీ ప్రభాకర్ తెలియజేశారు. కాలువల్లో మురుగు పేరుకుపోవడం వలన దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని సీఎస్‌సీ-3 విభాగాధిపతి డాక్టర్ ఎ.సింథెల్ వివరించారు. ప్రజలు దోమ తెరలను వాడాలని, మూడు రోజులకు మించి జ్వరం ఉంటే వైద్యులను సంప్రదించాలని అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి.సురేష్, వలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డీన్ డాక్టర్ హబీబుల్లా, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డిలు అభినందించారు.

## అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

**ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా**

**మంగళగిరి:** మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ) పరిధిలోని అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 23వ తేదీలోపు అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనధికార లే అవుట్లలో 2025, జూన్ 30వ తేదీలోపు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు అర్హులని తెలిపారు. అనధికారికంగా విభజించిన లే అవుట్లలో కనీసం ఒక్క ప్లాటు అయినా 2025, జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ జరిగి ఉండాలన్నారు. దస్తావేజులు, లింకు దస్తావేజులు కలిగి ఉండాలని, పూర్తి వివరాలకు ఎంటీఎంసీ కార్యాలయం మంగళగిరి, తాడేపల్లిలోని పట్టణ ప్రణాళికా విభాగాలలో సంప్రదించాలని తెలిపారు.

## ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు

**అధికారులు తనిఖీలు.. 18 క్వింటాళ్ల ప్లాస్టిక్ కవర్లు పట్టివేత**



మెయిన్‌బజార్‌లోని దుకాణాలు తనిఖీలు చేస్తున్న అధికారులు

**మంగళగిరి:** మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ) పరిధిలో శుక్రవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మున్సిపల్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించి 18 క్వింటాళ్ల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధానంగా నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు ప్లాస్టిక్ కవర్లను సరఫరా చేసే హోల్‌సేల్ దుకాణాల జోలికి వెళ్లకపోవడమే అనుమానాలకు తావిస్తుంది. నెలనెలా ఆయా దుకాణాల నుంచి అధికారులకు మామూళ్లు అందుతున్న కారణంగా హోల్‌సేల్ దుకాణాల జోలికి వెళ్లకుండా చిరు వ్యాపారులపై ప్రతాపాన్ని చూపుతున్నారని చిరు వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో హోల్‌సేల్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పకడ్బందీగా అమలు చేసి ప్లాస్టిక్‌ను నియంత్రించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నదీనా బేగం మాట్లాడుతూ ఇక నుంచి నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్ల విక్రయాలను అడ్డుకునేలా ఎంటీఎంసీ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, ప్లాస్టిక్ కవర్ల విక్రయదారులపై తొలుత జరిమానా విధించడం జరుగుతుందన్నారు. అనంతరం మరలా ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే కేసులు నమోదు చేసి పర్యావరణ చట్టం కింద చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలని కోరారు.

# విద్యావేత్త శివరాంను ఆదర్శంగా తీసుకోవాలి



**తాడేపల్లిరూరల్:** ప్రముఖ విద్యావేత్త మంచిరెడ్డి శివరాం రెడ్డి (శివరాం)ను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని అరవింద హైస్కూల్ ప్రిన్సిపాల్ ఇంద్రాణి అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్‌లో శుక్రవారం శివరాం విద్యాభివృద్ధికి చేసిన సేవలపై సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రాణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలన్నారు. చిన్నవారి నుంచి పెద్దవారి వరకు అందరితో కలసిపోవడం శివరాం మాస్టారి గొప్పతనమని వర్ణించారు. ఆయన మృతి చెందినా శరీరాన్ని మెడికల్ కళాశాలకు ఇచ్చిన ధన్యజీవని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ, పీఈటీ శ్రీనివాసరావు, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి గాదె సుబ్బారెడ్డి, పాఠశాల సెక్రటరీ ఆదర్శ్, చైత్ర, ఉపాధ్యాయులు కొండా నాయక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఫిరంగిపురం:** మండలంలోని ఎనిమిది గ్రామాల్లో శనివారం విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఫిరంగిపురం, రేపూడి, గొల్లపాలెం, 113 తాళ్లూరు, వేమవరం, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, గరుడావలపాలెం గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

## కార్మికవర్గ రాజ్య స్థాపనే సీఐటీయూ లక్ష్యం



మాట్లాడుతున్న వేముల దుర్గారావు

**తాడేపల్లిరూరల్:** కార్మికవర్గ రాజ్య స్థాపనే లక్ష్యంగా సీఐటీయూ పనిచేస్తుందని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సీఐటీయూ కార్యాలయంలో కె.బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దుర్గారావు మాట్లాడుతూ దేశంలో సమరశీల పోరాటాల్లో సీఐటీయూ అగ్రభాగాన ఉందని అన్నారు. 1974 చరిత్రాత్మకమైన రైల్వే సమ్మె పోరాటం నుంచి నేటి వరకు అనేక పోరాటాల్లో సీఐటీయూ ముఖ్య పాత్ర పోషించిందని అన్నారు. సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, నారిన నాగేశ్వరరావు, వెంగమ్మ, రేణుక, కొండయ్య, ఎస్‌కే జానీ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి




సమావేశంలో ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

**తాడేపల్లిరూరల్:** కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నులకపేట ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బి.కొండారెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం తీసుకురావడంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఎన్నికల సమయంలో మోటారు రవాణా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.10 వేలు ఇచ్చిందని, తాము అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి, విస్మరించారని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించి ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి, వసూలు చేసిన వెల్ఫేర్ ఫండ్‌ను ఆటో కార్మికులకు మాత్రమే వినియోగించాలని, సాధికారక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌కే శ్రీను (వేపచెట్టు శ్రీను), జాన్ సైదా, ఆర్.శ్రీనివాసరాజు, శ్రీనివాస్, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

# చలో ఒంగోలును జయప్రదం చేయండి

**సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య**



మాట్లాడుతున్న కంచర్ల కాశయ్య

**తాడేపల్లిరూరల్:** ఈ నెల 23, 24, 25 తేదీలలో ఒంగోలు నగరంలో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపు మధ్యాహ్నం 3 గంటలకు ఒంగోలు నగరంలో భారీ ప్రజా ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతాయని తెలిపారు. ఈ సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కె.నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జి.వి.సత్యనారాయణలతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర నాయకత్వం హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను రాష్ట్ర మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, శీలం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## దాడి కేసులో నిందుతుడి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

**తాడేపల్లిరూరల్ :** ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో నిందుతుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాడేపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లి సీతానగరంకు చెందిన దేవర మహేష్‌పై ఈ నెల 19వ తేదీ రాత్రి ఉండవల్లి సెంటర్‌లో మద్యం తాగి ఉన్న జలచిత్ర వికాస్ అలియాస్ బన్నీ అనే యువకుడు బీర్ బాటిళ్లతో దాడి చేశాడని పేర్కొన్నారు. గతంలో ఉన్న గొడవలను మనసులో పెట్టుకుని మహేష్‌ను చంపాలనే ఉద్దేశంతో బీర్ బాటిళ్లతో తల పగలగొట్టాడని తెలిపారు. గాయపడిన మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, శుక్రవారం బన్నీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించబోమని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# చిరంజీవి జీవితం స్ఫూర్తిదాయకం



రక్తదానం చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి

**మంగళగిరి:** మెగాస్టార్ పద్మ విభూషణ్ చిరంజీవి జీవితం స్ఫూర్తిదాయకం అని మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చినకాకాని ఎన్ఆర్ఐ జంక్షన్ వద్ద లిటిల్ విలేజ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన గంజి చిరంజీవి మాట్లాడుతూ 70 సంవత్సరాల వయస్సులోను మెగస్టార్‌పై అభిమానులలో క్రేజ్ తగ్గలేదన్నారు. రక్తదానం, నేత్రదానం కార్యక్రమాలతో మెగస్టార్ ఎంతో మంది జీవితాలలో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు పాల్గొన్నారు.

**ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు**

**తాడేపల్లిరూరల్:** సినీ నటులు, పద్మ విభూషణ్, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని ప్రజా కాపునాడు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని నమ్మిన చిరంజీవి బ్లడ్, ఐ బ్యాంక్‌లను స్థాపించి ఎంతోమందికి రక్త, నేత్రదానం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రజా కాపునాడు తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు పుల్లెపు భాస్కర్ రావు, నాయకులు టంకసాల ఈశ్వర్ నాయుడు, కమిటీ సభ్యులు తాడికొండ నాగేశ్వరరావు, దుర్గారావు, పూడి రమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

**అనాథాశ్రమంలో చిరంజీవి జన్మదిన వేడుకలు**

**తాడికొండ:** మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలువురు యువకుల ఆధ్వర్యంలో బడేపురం గ్రామంలోని చిన్నారుల అనాథాశ్రమంలో 60 మందికి దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. పలువురు మాట్లాడుతూ సినీ రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగొందుతున్న చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వారికి రక్తం అందిస్తూ తన వంతు సేవలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ తాయి చందు, మాజీ ఎంపీటీసీ ఆళ్ళ హనుమంతరావు, ఆళ్ళ చిన్న హనుమంతరావు, ఆళ్ళ ప్రవీణ్, ఆళ్ళ శ్రీకాంత్ చిరంజీవి అభిమాన సంఘం యువకులు పాల్గొన్నారు.

## సీఆర్డీఏ 'గ్రీవెన్స్'లో రాజధాని సమస్యలపై 51 ఫిర్యాదులు


**అర్జీలు స్వీకరించిన సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్**



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

**తాడికొండ:** తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్‌లో మొత్తం 51 అర్జీలు వచ్చినట్లు సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. వార్షిక కౌలు చెల్లింపు, ల్యాండ్ పూలింగ్ స్కీం, రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు-రిజిస్ట్రేషన్, రాజధాని ప్రాంత పేదల పింఛన్ల మంజూరు, భవనాలు, లే అవుట్ అనుమతుల జారీ తదితర సమస్యల గురించి పలువురు రాజధాని ప్రాంతవాసులు అర్జీలను అడిషనల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు ఇచ్చిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. వార్షిక కౌలు సంబంధిత అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఏపీ సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై పలు ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం చూపగా మిగిలినవి వీలైనంత త్వరగా పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. రైతుల సమస్యలు పరిష్కరించటంలో అలసత్వం వద్దని అధికారులకు హితవు పలికారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

### అనుమానాస్పదంగా యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు

**మంగళగిరి:** దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు వంతెన వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందడం జరిగింది. యువకుడు మంగళగిరి వైపు నుంచి తెనాలి వైపు వెళ్తుండగా రేవేంద్రపాడు వద్ద లారీ ఢీకొని మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం అయితే పోలీసులు యువకుడు గురించి వివరాలు ఎందుకు వెల్లడించడం లేదనే దానిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యువకుడి వయసు సుమారు 26-27 ఉండవచ్చని స్థానికులు అంటున్నారు. ఉదయం యువకుడు మృతి చెందితే మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించిన పోలీసులు వివరాలు వెల్లడించకపోవడం, కనీసం మీడియా అడిగినా సమాధానం చెప్పకపోవడం, కేసు ఏమి నమోదు చేశారో బయటకు తెలపకపోవడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనంపై రోడ్డుకు ఎడమవైపున తన దారిన తాను వెళ్తుండగా ఎదురుగా ఎడమవైపున అకస్మాత్తుగా లారీ దూసుకువచ్చి ఢీకొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. మంగళగిరి రూరల్ పోలీసులు మాత్రం యువకుడు మృతిపై నోరు విప్పకపోవడం గమనార్హం.

# డ్రెయిన్ల నిర్మాణ పనులు పరిశీలన

**తెనాలి టౌన్:** రూరల్ మండల గ్రామం కొలకలూరులో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ పనులను 'డ్వామా' ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ శుక్రవారం పరిశీలించారు. తొలిసారిగా నిర్మించే ఈ మ్యాజిక్ డ్రెయిన్ల కారణంగా మురుగు ఎప్పటికప్పుడు భూమిలోకి ఇంకుతుందని ఆయన చెప్పారు. నేల నీటిని త్వరితగతిన గ్రహించే అవకాశం ఉందన్నారు. ఫలితంగా దోమల వ్యాప్తికి ఆస్కారం ఉండదన్నారు. సిమెంటు కాలువలతో పోలిస్తే వీటి నిర్మాణ వ్యయం తక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ముందుగానే గ్రామంలో పర్యటించి తగిన ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.